ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం 5 డిసెంబరు 2025



## నర్సంపేటకు నేడు సీఎం



- రూ.531 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మెడికల్ కళాశాల సమీపంలో బహిరంగ సభ
- ఆవిష్కరణకు శిలాఫలకాలు సిద్ధం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే దొంతి
- సీఎం హోదాలో తొలిసారిగా నర్సంపేటకు వస్తున్న రేవంత్



నర్సంపేటలోని మెడికల్ కళాశాల వద్ద బహిరంగ సభ వేదిక

నర్సంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ కేంద్రానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం రానున్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.531 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన పట్టణ శివారులోని మెడికల్ కళాశాల సమీపంలో శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ బిల్డింగ్, మెడికల్ కళాశాల భవనం, సీసీరోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, వరంగల్ నుంచి నర్సంపేట వరకు 4 లైన్‌రోడ్ నిర్మాణం, నర్సంపేట నుంచి పాకాల రోడ్, నర్సంపేట, సర్వాపురం, అయోధ్యనగర్, అశోక్‌నగర్. పాకాల వరకు 2లైన్‌ల రోడ్డు నిర్మాణం, నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు హెలీకాప్టర్‌లో నర్సంపేట చేరుకుంటారు. సభాస్థలికి సమీపంలోనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలికాప్టర్ దిగగానే సీఎం నేరుగా శంకుస్థాపనలు చేసి సభ వేదికకు చేరుకుంటారు. కాగా, సీఎం సభకు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పార్టీ నాయకులతో కలిసి పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు. సభకు భారీ ఎత్తున ప్రజలు. పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా తాగేనీరు సౌకర్యం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

# ఖర్చు తడిసి మోపెడు



- భరించేదెలా.. అని అభ్యర్థుల మల్లగుల్లాలు
- గత ఎన్నికలకన్నా రెండింతలు పెరగనున్న ఖర్చు
- మద్యం, విందులకే ఎక్కువ వ్యయం
- కనీసం ఖర్చు రూ.10 లక్షలపైనే..
- మేజర్ పంచాయతీల్లో రూ.50లక్షల వరకు..
- రెండు, మూడో విడత అభ్యర్థులపై మరింత భారం
- గెలుపే లక్ష్యంగా ఎంత ఖర్చుకైనా సిద్ధం
- జనరల్ స్థానాల్లో అపరిమితంగా వ్యయం

హనుమకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారం ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. సర్పంచ్ పదవులపై దృష్టిసారించిన ఆశావహులు చాలా రోజుల ముందు నుంచే ఓటర్లను, మద్దతుదారులను ప్రసన్నం చేసుకోవడానికి ఇప్పటికే కొంత మేరకు ఖర్చు పెట్టారు. అభ్యర్థులు గెలుపు కోసం చావోరేవో తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఎంతఖర్చయినా పెట్టేందుకు సైతం పూనుకుంటున్నారు. అయితే అంగబలం, ఆర్థిక బలం ఉన్నవారు ఖర్చు విషయంలో వెనుకాడకపోవచ్చుకానీ పేద, మధ్య తరగతి అభ్యర్థుల పరిస్థితే ఇబ్బందికరంగా మారనున్నది. ఆస్తులు అమ్మి ఖర్చు చేసే స్థితిలో లేని వీరికి డబ్బులు జమ చేసుకోవడం, పెద్దఎత్తున ప్రచారానికి ఖర్చు పెట్టడం సాధ్యంకాక ఏం చేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

### చేతులెత్తేస్తున్న నేతలు

పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగటం లేదు. కనుక అభ్యర్థులు ఏ పార్టీ నుంచి ప్రత్యక్షంగా నిధులు అడగలేరు. అధికార, ప్రతి పక్ష పార్టీల ప్రోత్సాహంతో బరిలో నిలిచే అభ్యర్థులకు కూడా పెద్దగా నిధులు సమకూరే అవకాశాలు లేవు. సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య అపరిమితంగా ఉండడంతో పార్టీల ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు ప్రచారం ఖర్చు సమకూర్చడానికి ఉదారంగా ముందుకు రావడానికి సాహసించడం లేదు. నియోజకవర్గాల్లో పార్టీ పునాదులు బలపడ డానికి, గ్రామ స్థాయిలో బలాన్ని, బలగాన్ని పెంచు కోవడానికి పంచాయతీ ఎన్నికలు ఎమ్మెల్యేలకు ఒక అవకాశం అయినప్పటికీ అభ్యర్థుల ప్రచారం ఖర్చును భరించడం కష్టమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ పరిస్థితి ఏమిటి? అని అభ్యర్థులు మథన పడుతున్నారు.

### భారీగా పెరగనున్న ఖర్చు

పంచాయతీ ఎన్నికలు అంటేనే పోటీ ఎక్కువగా ఉంటుంది. స్థానికంగా ఉండే బడా నాయకులు రిజర్వేషన్ల ఆధారంగా బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎన్నికల ఖర్చు వారిలో భయాన్ని రేకెత్తిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలకంటే ఈ సారి రెండింతలు ఖర్చు చేయాల్సి వస్తోందని తర్జనభర్జన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,708 గ్రామ పంచాయతీలు, 15,006 వార్డులు ఉన్నాయి. శాసన సభ ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు కాగా, ప్రస్తుత పంచాయతీ ఎన్నికల సందర్భంగా చిన్న గ్రామంలో రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు, పెద్ద పంచాయతీలు అయితే రూ.10లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఖర్చు రావచ్చని భావిస్తున్నారు. ఆదాయం అధికంగా ఉండే మరికొన్ని పంచాయతీల్లో ఈ ఖర్చు దాదాపు రూ.50 లక్షల వరకు ఉండొచ్చని చర్చించుకుంటున్నారు. ప్రచారం కోసం కార్యకర్తలు వెంట తిరగడం, వారికి టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతో పాటుగా మద్యం కోసం అధికంగా ఖర్చు కానున్నది. పోలింగ్ ముందు రోజు ఖర్చు మరింత రెట్టింపు అవుతుందని నాయకులు బాహాటంగానే చెబుతున్నారు.

### నిబంధనలు ఉన్నా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార వ్యయాన్ని కట్టడి చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను జారీ చేసినప్పటికీ అవి ఆచరణలో ఎక్కడా అమలయ్యేలా కనిపించడం లేదు. ఎన్నికల బరిలోని అభ్యర్థులు తప్పకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాల్సి ఉన్నా ప్రచారం జోరు, హోరాహోరు పోరులో అవి గాలికికొట్టుకుపోయేట్టు ఉన్నాయి. 5వేలలోపు జనాభా కలిగిన పంచాయతీలో పోటీ చేసే వార్డు సభ్యుడు రూ.30వేలు, సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50లక్షల వరకు (మిగతా 8లో..)

## ఎన్నికల ఎఫెక్ట్..

### జోరుగా ఇంటి పన్నుల వసూళ్లు..





చిట్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఇంటి చుట్టూ తిరిగి ఇంటి పన్ను కట్టమన్నా కట్టరు.. వచ్చే నెల కడుతాం.. మళ్లొచ్చే నెల కడుతామని సాకులు చెబతూ వాయిదా వేస్తారు. కాని పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని గ్రామాల్లో పాత బకాయిలు మొత్తం క్లియర్ చేస్తున్నారు. ఒక గ్రామంలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లతో సహా ఇంటి పన్నులు కడితేనే పోటీ చేయడానికి అర్హులు అనే నిబంధనలు ఉండడంతో పోటీ చేసే వార్డు సభ్యులు , సర్పంచ్‌లు తమ ఇంటి పన్నులు క్లియర్ చేస్తున్నారు. అంతేకాదండోయ్.. వార్డు సభ్యులు ఇంటి పన్నులు సైతం సర్పంచ్‌లుగా పోటీ చేసే అభ్యర్థులు కడుతుండడం విశేషం. ఒక్కో గ్రామ పంచాయతీలో వార్డు సభ్యులు మూడు నాలుగు పార్టీల నుండి పోటీలో ఉండగా , సర్పంచ్ అభ్యర్థులు సైతం మూడు నాలుగు పార్టీల నుండి పోటీల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో భారీ ఎత్తుగానే ఇంటి పన్నులు వసూలవుతున్నట్టు తెలిసింది.

## ప్రజల పక్షాన పోరాటం చేసేవాళ్లపై కేసులు

**- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు**

కాటారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజల పక్షానా పోరాటం చేస్తే అక్రమంగా కేసులు పెడుతున్నారని, కోర్టులు మందలించినా అధికారపార్టీ నేతలకు అంటకాగుతూ అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీసుల్లో మార్పు శూన్యమని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. మండలంలోని గంగారంలో ఇటీవల పోలీసులు అరెస్ట్ చేయగా బెయిల్‌పై వచ్చిన బీఆర్ఎస్ నేత చల్ల శేఖర్‌ను బీఆర్ఎస్ నేతలతో కలిసి పుట్ట మధు గురువారం పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు విలేకరులతో మాట్లాడుతూ గంగారంలో ఇంటి పన్ను వసూళ్లలో అవకతవకలు జరిగాయని, డబ్బులు అన్యాక్రాంతం అయ్యాయని చట్టపరంగా ఫిర్యాదు చేస్తే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ నేతృత్వంలో పోలీసులు తప్పుడు ఫిర్యాదుతో అక్రమ కేసు పెట్టారని మండిపడ్డారు. కేసులు నిజమైతే కనీసం 15 రోజులు జైల్లో ఉండాలని, కానీ ఒకటి రెండు రోజుల్లో బెయిల్ రావడం చూస్తే తప్పుడు కేసులని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. గుండ్రాత్‌పల్లిలో ప్రభాకర్ రెడ్డి, గంగారంలో దేవేందర్‌రెడ్డి అనేక దందాలు చేసి దుద్దిళ్ల కుటుంబానికి సేవ చేశారని, అయినా వారికి గుర్తింపు లేదని, ఇంకా కాంగ్రెస్ జెండాలు, ఫోటోలు పెట్టుకోవడంపై వారు ఆలోచన చేయాల న్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు బాసాని రవి, ఐలి రాజబాపు, కుడుదుల రాజబాబు, వెంకటస్వామి, రమణ, సంతోష్, నాగరాజు, సమ్మయ్య, రాజేంద్రచారి, విక్రమ్, మనోహర్, తిరుపతి, రవేష్, సతీష్, రమేష్, తిరుపతిరెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గంగారంలో మాట్లాడుతున్న పుట్ట మధు

## ఒకే మహిళ.. రెండు స్థానాలకు పోటీ



మొగుళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానంతో పాటు 12వ వార్డు స్థానం బీసీ మహిళకు రిజర్వు అయింది. గ్రామానికి చెందిన చిలకమారి ఉమాదేవి 12వ వార్డు స్థానానికి, సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వార్డు స్థానానికి గ్యాస్‌పొయ్యి. సర్పంచ్ స్థానానికి కత్తెరగుర్తు కేటాయించారు. రెండు స్థానాల్లో గెలిస్తే ఏదో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈవిషయమై అదనపు కలెక్టర్ విజయలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఏదో ఒకపదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందని వివరణ ఇచ్చారు.

## జోరుగా ముందస్తు మొక్కులు

- మేడారానికి వేల సంఖ్యలో భక్తుల రాక
- గోవిందరాజు గద్దె స్థల చలనానికి ప్రత్యేక పూజలు
- పగడిద్దరాజు గద్దెకు గత నెలలోనే పూజల పూర్తి
- 24న పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల పునఃప్రతిష్ఠ

తాడ్వాయి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి గురువారం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజులను దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించు కున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తల్లుల భక్తులు తరలివచ్చి దేవతల గద్దెలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కళ్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం ఎత్తు బంగారం(బెల్లం)తో గద్దెలకు చేరుకున్నారు. ఈ క్రమంలో తల్లులకు పూజలు చేసి పూలు పండ్లు పసుపు కుంకుమ చీర సారెలు కొబ్బరికాయలు యాట మొక్కులను సమర్పించుకున్నారు. మేడారం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకొని బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు. సుమారు 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

### గద్దెలకు అలంకరణ

మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను మామిడి తోరణాలు, పూల దండలతో దేవాదాయ శాఖ అధికారులు గురువారం అలంకరించారు. గోవిందరాజు గద్దె స్థాన చలనం కార్యక్రమంలో భాగంగా గద్దెలను ముస్తాబు చేసినట్లు సిబ్బంది తెలిపారు.

### 24న పునఃప్రతిష్ఠ

మేడారం దేవస్థానంలో పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల పునఃప్రతిష్ఠకు పూజారులు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ముహూర్తం గురువారం ఖరారు చేశారు. అయితే దేవస్థానం పరిసరాల్లోని షెడ్‌లో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పూజారులు హాజరయ్యారు. దేవస్థానం మాస్టర్ ప్లాన్ ప్రణాళికలతో చేపట్టిన రాతి కట్టడాల నిర్మాణ అభివృద్ధి పనుల్లో భాగంగా గద్దెల నిర్మాణ (మిగతా 8వ పేజీలో)



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



వనదేవతల గద్దెలకు తరలివస్తున్న భక్తులు

## గద్దెల పునఃప్రతిష్ఠాపన వాయిదా

- మరో తేదీని ప్రకటించిన పూజారులు
- పూజారుల ఆలస్యమా.. పనుల్లో జాప్యమా...?



అసంపూర్తిగా ఉన్న పగిడిద్దరాజు నిర్మాణ పనులు

ములుగు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మల దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ఈ నెల 4న చేపట్టనున్న గోవిందరాజు, పగిడిద్దరాజు పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం వాయిదా పడింది. ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గోవిందరాజు పూజారులైన దబ్బకట్ల వంశీయులు, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పునుగొండ్ల గ్రామం నుంచి పగిడిద్దరాజు పూజారులు పెనుక వంశీయులు నూతన గదెదలపై పునఃప్రతిష్ఠాపించనుండగా ఆ తంతు నిలిచిపోయింది. అందుకు కారణం పూజారులు సమన్వయ లోపమా..? గద్దెల నిర్మాణ పనుల్లో జాప్యమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### మరో తేదీని ప్రకటించిన పూజారులు..

గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం అనుకోకుండా నిలిచిపోయింది. ఈ క్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీరస్వామి ఆధ్వర్యంలో పూజారుల సమావేశం ఏర్పాటు చేసుకుని మరో తేదీని ఈ నెల 23 రాత్రి మూహుర్తాన్ని ప్రకటించుకున్నారు. అయితే పూజా కార్యక్రమానికి అయ్యే ఖర్చుల్లో ఆర్థిక ఇబ్బందులు (మిగతా 8వ పేజీలో)

## కొన సాగిన రెండోరోజు నామినేషన్ల పర్వం

ములుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో మూడో విడుత నామినేషన్ల ప్రక్రియ గురువారం కొనసాగింది. మొదటి విడతలో తాడ్వాయి, గోవిందరావుపేట, ఏటూరునాగారం మండలాలలో నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ ముగియగా, రెండో విడతలో ములుగు, వెంకటాపూర్, జేడీ మల్లంపల్లి మండలాలలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తైంది. ఈ నెల 6న ఉపసంహరణ ఉంటుంది. మూడో విడతలో భాగంగా వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాలకు నామినేషన్ల స్వీకరణ రెండో రోజు ముగిసింది. మొదటి రోజు మూడు మండలాల నుంచి నామినేషన్లు అంతంత మాత్రంగానే వచ్చాయి. అయితే రెండో రోజు నామినేషన్ల సంఖ్య భారీగా పెరిగింది. మూడు మండలాల్లోని 46 గ్రామ పంచాయతీలు, 408 వార్డుల నుంచి రెండో రోజు సుమారు 32 సర్పంచ్, 145 వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు.

### రెండో రోజు నామినేషన్లు ఇలా..

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అధికారులు మూడో విడుత నామినేషన్ల ప్రక్రి యను వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో బుధవారం ప్రారంభించారు. అయితే మొదటి రోజు అభ్యర్థుల నుంచి నామినేషన్లు పెద్దగా రాలేదు. రెండో రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు పడ్డాయి. వాజేడు మండలంలో 18 మంది సర్పంచ్ స్థానాలకు నామినేషన్ దాఖలు కాగా, 54 మంది వార్డు మెంబర్ స్థానానికి నామినేషన్ వేశారు. అలాగే వెంకటాపురం మండలంలో 23 సర్పంచ్, 63 వార్డు మెంబర్ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ సమర్పించారు. కన్నాయిగూడెం మండలంలో 8 సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు 28 నామినేషన్లు దాఖలఅయ్యాయి. అయితే కన్నాయిగూడెం మండలంలో సాయంత్ర 5 గంటల వరకు కేవలం రెండు క్లస్టర్లకు సంబంధించిన వివరాలు మాత్రమే అధికారులు తెలిపారు. మరో క్లస్టర్‌కు సంబందించిన వివరాలు, మిగిలిన రెండు క్లస్టర్లకు సంబంధించి 5 గంటల తర్వాత వచ్చిన రిపోర్టును ఇవ్వలేదు. కాగా, వాజేడు మండలంలోని అయ్యవారిపేట జీపీ నుంచి 1 సర్పంచ్ 7 వార్డు సభ్యుల, చెరుకూరు జీపీ నుంచి 2 సర్పంచ్, చింతూరు జీపీ నుంచి 2 సర్పంచ్, 14 వార్డు మెంబర్, ధర్మవరం జీపీ నుంచి 2 సర్పంచ్, 4 వార్డు మెంబర్ , దూలాపురం జీపీ నుంచి 1 సర్పంచ్, 3 వార్డు మెంబర్, ఏడ్జర్లపల్లి జీపీ నుంచి 1 సర్పంచ్, 10 వార్డు మెంబర్, కృష్ణాపురం జీపీ నుంచి 1 సర్పంచ్, పెద్దగొల్లగూడెం జీపీ నుంచి 3 సర్పంచ్, నాగారం జీపీ నుంచి 1 సర్పంచ్, 10 వార్డు మెంబర్, పేరూరు జీపీ నుంచి 1 సర్పంచ్, 2వార్డు మెంబర్, (మిగతా 8వ పేజీలో)





వాజేడులో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి

| మండలం పేరు | సర్పంచ్ స్థానాలు | దాఖలైన నామినేషన్లు | వార్డు సభ్యులు | దాఖలైన నామినేషన్లు |
|---|---|---|---|---|
| వాజేడు | 17 | 18 (23) | 152 | 54 (68) |
| వెంకటాపురం | 18 | 23 (26) | 166 | 63 (67) |
| కన్నాయిగూడెం | 11 | 8 (10) | 90 | 28 (32) |

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

## కాటారం డివిజన్‌లో రెండో రోజు..

కాటారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):కాటారం డివిజన్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల కోసం నిర్వహిస్తున్న నామినేషన్ల ప్రక్రియ జోరందుకున్నది. రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని కాటారం డివిజన్ పరిధిలోని కాటారం, మహాముత్తారం, మల్హర్‌రావు, మహదేవపూర్ మండలాలను మూడో దశ కింద చేపట్టారు. నాలుగు మండలాల్లో ఉన్న 81 జీపీల్లో సర్పంచ్, 696వార్డు సభ్యుల స్థానాలున్నాయి. వీటిలో గురువారం రెండో రోజున సర్పంచ్ స్థానాలకు 153, వార్డు స్థానాలకు 395 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. పలువురు అభ్యర్థులు ప్రజలతో కలిసి డప్పు చప్పుళ్ల మహిళల కోలాటాల మధ్య ఊరేగింపుగా వచ్చి నామినేషన్లు దాఖలు చేయడంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. నామినేషన్ల కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. కాటారం మండలంలో 24గ్రామపంచాయతీల పరిధిలో రెండో రోజున సర్పంచ్ స్థానాలకు 35నామినేషన్లు, 210వార్డు సభ్యుల స్థానాలకు గానూ 113 నామినేషన్లు దాఖలై నట్లు అధికారులు వెల్లడించారు. మల్హర్ మండలంలో 15 గ్రామ పంచాయతీలుండగా సర్పంచ్ స్థానాలకు 26 నామినేషన్లు, 128వార్డు స్థానాలకు 94 నామినేషన్లు దాఖలయ్యాయి. మహా ముత్తారం మండలంలో 24 గ్రామపంచాయతీలుండగా సర్పంచ్ స్థానాలకు 50నామినేషన్లు, 196వార్డు స్థానాలకు 78నామినేషన్లు, మహదేవపూర్ మండలంలో 18గ్రామ పంచాయతీలుండగా సర్పంచ్ స్థానాలకు 42నామినేషన్లు, 162వార్డు స్థానాలకు 110నామినేషన్లు దాఖలయ్యాయి.

## మాజీ సీఎం రోశయ్య సేవలు చిరస్మరణీయం

**- వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర**



రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, పర్యవేక్షకులు మహేష్‌బాబు, మంజుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

తొర్రూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 10న ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం, 2026 జనవరి 5న హైదరాబాద్‌లో ధర్నా, జనవరి 29న పార్లమెంట్ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. గత 15ఏళ్లుగా టెట్ రాయమనలేదని, డీఎస్సీ పరీక్షరాసి ఎంపికైన వారిని ఇప్పుడు టెట్‌రాయమనడం హాస్యాస్పదమని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, మురళీకృష్ణ, నాగమల్లయ్య, వివేక్, బద్రునాయక్, మంజుల, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ ఇయాద్

పెద్దవంగర, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నాంచారి మడూర్ అసిస్టెంట్ మేనేజర్ ఇయాద్ అన్నారు. గురువారం మండలంలోని అవుతాపురం పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం కళాధర్ అధ్యక్షతన విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలు, లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బ్యాంక్ సేవల పట్ల అవగాహన కల్గి ఉండాలన్నారు. నేడు అంతర్జాలంలో పెరుగుతున్న వేళ సైబర్ వేధింపులకు గురికాకుండా ముందు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడినట్లుతే వెంటనే 1930టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. యువత ముఖ్యంగా చెడు మార్గంలో వెళ్లకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు రమేష్‌కుమార్, రవి, సింహాద్రి, మహబూబ్ ఆలీ, నర్సయ్య, సురేందర్, సమ్మయ్య, రామతార తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగులకు ఉచిత మెగా వైద్య శిబిరం

కృష్ణకాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పైలట్‌కాలనీలోని గల సింగరేణి ఫంక్షన్‌హాలులో ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, స్త్రీల సమస్యలు, క్యాన్సర్, గ్యాస్ట్రోఎంటరాలజీ ఉచిత మెగా వైద్య శిబిరం గురువారం నిర్వహించగా విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 200మంది ఉద్యోగులు, వారి కుటుంబీకులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి మందులను అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం కవీంద్ర , ఏసీఎంఓ పద్మజ, డాక్టర్ గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగేనా?

తొర్రూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు గత రెండేళ్లుగా లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిపోయింది. దీంతో ఎట్టకేలకు ఎన్నికలు నిర్వహించడా నికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీతో గ్రామాల్లో ఎన్నికల వేడి పుంజుకుంది. నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు బరిలో ఉంటారా.. అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు ఏకగ్రీవాలు చేసుకుం టాయా..? అనే చర్చ జరుగుతోంది. గత 2019 పంచాయతీ ఎన్ని కల్లో అధికార పార్టీ తొర్రూరు మండలంలో 29 సర్పంచ్ స్థానాల్లో 9 ఏకగ్రీవం చేసుకోగా 13 స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుదా రులు భారీ మెజార్టీతో గెలుపొందారు. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 7 మంది గెలుపొందారు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నప్పటికీ అసమ్మతి గళం వినిపిస్తుండ టంతో బీఆర్‌ఎస్ పార్టీ కూడా కొత బలం పుంజుకుంది. అయితే కాంగ్రెస్ అధికారంలో లేకున్నా పార్టీ బలోపేతం కృషి, ప్రస్తుతం వారికి పార్టీ నుంచి తగిన ప్రాధాన్యత లేకపోవడంతో అసమ్మతిగా, రెబల్స్‌గా పోటీ చేయడానికి కొంతమంది నాయకులు సిద్ధమయ్యా రు. దీంతో అధికార పార్టీ మద్దతు ఇచ్చే నాయకులు ఒక్కొక్క గ్రామం నుంచి 5 నుంచి 10 మంది పోటీ పడుతుండగా, బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఇస్తే పోటీలో ఉంటామని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అంటున్నారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న పలు గ్రామాల్లో ఆశావాహులు అత్యధికంగా నామినేషన్లు వేశారు. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో ప్రజా ప్రతినిధుల నుంచి పార్టీ నాయకుల వరకు సర్పంచ్ స్థానాలు ఏమైనా ఏకగ్రీవాలు జరిగేనా? అంటు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు.

### తగ్గేది లేదంటున్న అసమ్మతి వర్గం.. రెబల్స్

తొర్రూరు మండలంలో గతంలో 9 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కావడంతో, బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో 13 గ్రామాల్లో గెలుపొందా రు. ఈ సారి మాత్రం పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. వర్గపోరు, స్థానిక అసంతృప్తి, అభ్యర్థుల మధ్య విభేదాలు ఉండ టంతో అసమ్మతిగళం వినిపిస్తున్న నాయకులు తగ్గేది లేదంటూ బరిలోకి దిగారు. 31 గ్రామ పంచాయతీలకు 197 మంది సర్పంచ్ అభ్యర్థులు, 276 వార్డులకు 709 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అత్యధికంగా అధికార పార్టీకి చెందిన నాయకులు నామినేషన్లు వేశారు. నామినేషన్ ఉపసంహరణ సమయం రేపటి వరకు ఉన్నా ఇప్పటి వరకు సమన్వయపర్చకపోగా పోవడంతో అభ్యర్థులు బరిలో నుంచి తగ్గేది లేదంటున్నారు. దీంతో స్తబ్దతగా ఉన్న నిరాశావాహులు పోటీకి దిగుతుండడంతో ఏకగ్రీవాల అవకాశాలు తగ్గనున్నాయి.

## కుటుంబ నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత

కృష్ణకాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని భూపాలపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించిన కుటుంబ నియంత్రణ చికిత్స శిబిరాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురుషులకు కోత కుట్టులేని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తు న్నామన్నారు. ఈ శిబిరాన్ని పురుషులు వినియోగించుకోవాలని కోరారు. గత నెల 21 నుంచి గురువారం వరకు 109 ఆపరేషన్లు విజయవంతంగా చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఓఎంసీహెచ్ డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం నాయకుల అరెస్టు

తొర్రూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను అక్రమంగా ఆక్రమించుకోవాలని నిరుపేదలను తప్పుదోవపట్టిస్తున్న సీపీఎం నాయకులు బొల్లం అశోక్, కొమ్మనబోయిన యాకయ్యలను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేందర్ గురువారం రాత్రి తెలిపారు. న్యాయమూర్తి ఎదుట సీపీఎం నాయకులను హాజరుపర్చగా, వారికి జ్యుడిషియల్ రిమాండ్ విధించ గా నిందితులను రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించి నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఇళ్లను ఆక్రమించిన మిగిలిన వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని, వారిని రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

## న్యాయమూర్తిని కలిసిన ములుగు ఎస్పీ

ములుగు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జీ ఎస్‌వీపీ సూర్య చంద్రకళను మర్యాద పూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖల మధ్య సమన్వయం, కేసులు త్వరితగతిన పరిష్కారానికి అవసరమైన సహకారం వంటి అంశాలపై పరస్పరం చర్చించారు. సెషన్స్ జడ్జి ఈ రెండు శాఖల మధ్య సమన్వయం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదప డుతుందని అన్నారు.

## సర్పంచ్‌గా గెలిపిస్తే వైఫై, టీవీ చానల్ ఉచితం..

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామపరిధిలోని ప్రతీ కుటుంబానికి వైఫైతో పాటు టీవీ ఛానల్‌లను ఉచితంగా అందిస్తానని గ్రామ పంచాయతీ ప్రజలకు బాండ్ పేపర్ రాసిచ్చా రు. ఆ అభ్యర్థి ఈ బాండ్ పేపర్‌ను చూపుతూ ఇంటింటా ప్రచారం కొనసాగిస్తున్నా రు. మేజర్ గ్రామపంచాయతీలో ఓ పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన సర్పంచు అభ్యర్థి తనను సర్పంచ్‌గా గెలిస్తే ఏమేమి చేస్తానో బ్రాండ్ పేపర్ రాసిచ్చింది. ప్రతీ కుటుంబానికి ఉచిత వైఫైతో పాటు ఫ్రీ చానల్ ఇస్తానని, గ్రామపంచాయతీలో కోతుల బెడద లేకుండా చూ స్తానని, గోదావరి కరకట్టకు లీకేజీకి సంబంధించిన పనులను చేస్తానని, తదితర హామీలను బాండ్ పేపర్‌లో రాసిచ్చారు. ఈ తరహా ప్రచారాన్ని పలువురు చర్చించుకుంటున్నారు.




గ్రామ పంచాయతీ ప్రజలకు రాసిచ్చిన బాండ్ పేపర్

## సర్పంచ్ పదవి కోసం అంగన్‌వాడీ ఉద్యోగాలకు రాజీనామా

మరిపెడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు, ఓ హెల్పర్ వారి ఉద్యోగాలకు రాజీనామా చేసి గురువారం సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. మండలంలోని ఆనేపురం సర్పంచ్ జనరల్ మహిళకు రిజర్వు కాగా, ఆ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కౌలూరి శిరీష ఉద్యోగానికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. గాలివారిగూడెం జీపీ జనరల్ మహిళకు దక్కగా అక్కడి అంగన్‌వాడీ టీచర్ సీహెచ్.రాములమ్మ ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ వేయగా శుక్రవారం ముహూర్త బలం చూసుకొని మరో నామినేషన్ సెట్ వేయనున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఎల్లంపేట రెవెన్యూ పరిధి సోమ్లాతండా జీపీ ఎస్టీ మహిళకు రిజర్వు కాగా, అక్కడి ఆయా భూక్యా బదీలి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. శిరీష సర్వీస్ ఇంకా 15ఏళ్లు ఉండగా రాములమ్మకు 5ఏళ్లు, బదీలికి సంవత్సరం పాటు సర్వీస్ ఉంది. ఈ మూడు చోట్ల అభ్యర్థులకు హోరాహోరీ పోటీ ఉంటుందని ఆయా గ్రామాల ఓటర్లు చెబుతున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు..

- ప్రమాదం నుంచి బయటపడిన ఐదుగురు వ్యక్తులు
- శ్రీశైలం వెళ్లి వస్తుండగా ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో పాలకుర్తి-ఘన్‌పూర్ రోడ్డు పక్కన గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొట్టిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం హన్మకొండ జులైవాడకు చెందిన కోటేశ్వర్ అనే వ్యక్తి ఐదుగురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుగు ప్రయాణంలో భాగంగా పాలకుర్తి- ఘన్‌పూర్ మీదుగా హన్మకొండకు వెళ్తుండగా, కారు అదుపుతప్పి పాలకుర్తి-ఘన్‌పూర్ రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. అక్కడే ఉన్న విద్యుత్‌శాఖ కాంట్రాక్టర్ చల్లా రఘురెడ్డి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి విద్యుత్ సరఫరాను నిలిపివేయించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో స్వల్పగాయాలయ్యాయి.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీదికొండ క్రాస్ రోడ్డు వద్ద కారు, బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో తాటికాయల అనిల్, బండి సాంబరాజులకు తీవ్రగాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మీదికొండకు చెందిన అనిల్, సాంబరాజు బైక్ పై ఘన్‌పూర్‌కు వస్తున్నారు. జనగామ నుంచి ఘన్‌పూర్ వైపు వస్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అనిల్, సాంబరాజులు రోడ్డు పైన ఎగిరిపడడంతో గాయపడ్డారు. బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్ అక్కడి నుంచి ఉడాయించడంతో అక్కడే ఉన్న గ్రామస్థులు వాహనంలో ప్రమాదానికి కారణమైన కారు వెనుకాల వెంబడించి పట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

## పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

కన్నాయిగూడెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వైద్యశాలలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహించినా, సమయ పాలన పాటించకున్నా కఠినమైన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో గోపాలరావు హెచ్చరించారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటలేరని సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల కారణంగా గురువారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిష్టరు, రికార్డులను ,పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి రోస్టర్ పద్ధతిన విధులను కేటాయించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం అమలు చేయలన్నారు. కార్యక్ర మంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పవన్ కుమార్, శ్రీకాంత్, మెడికల్ ఆఫీసర్ మధుకర్, గిరిబాబు, హెల్త్ ఎడ్యూకేటర్ సుజాత, సూపర్‌వైజర్ రమణకుమారి, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

మల్హర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుబ్బపేట, అడ్వాలపల్లి, గాధంపల్లిలోని గుడుంబా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి 20 కిలోల చక్కెర, 700 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు.



# అభ్యర్థుల్లో కోవర్టుల దడ..

- ప్రలోభాలకు తెర.. రహస్య మంతనాలు..
- ప్రధాన నాయకులు, అనుచరులే టార్గెట్

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడతలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులను కోవర్టుల బెడద వెంటాడుతోంది. ఆయా మండలాల్లో ప్రధాన పార్టీల మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రలోబాల పర్వానికి తెర లేపుతున్నారు. జిల్లాల్లో ఏటూరునాగారం, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో మొదటి విడతలో గ్రామపంచాయతీలు ఎన్నికలు ఈ నెల 11న జరగనున్నాయి. మూడు మండలాల్లో నామినేషన్లు, ఉపసంహరణ, గుర్తులు కేటాయింపు తదితర ప్రక్రియ పూర్తికాగా బరిలో నిలిచిన అభ్యర్థులు జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. మూడు మండలాల్లో మొత్తం 48 గ్రామపంచాయతీలు ఉండగా ఇందులో 9 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 39 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా 145 మంది సర్పంచు అభ్యర్థులు బరిలో నిలిచారు. దీంతో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. అభ్యర్థుల వెంట ఉండే కొందరు ముఖ్య నాయకులు, కార్యకర్తలను తమ వైపు లాగేందుకు రహస్య మంతనాలను కొనసాగిస్తున్నారు. ప్రధాన పార్టీల మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రత్యర్థి అభ్యర్థుల వారిని తమ వైపు లాగేందుకు శత విధాలుగా ప్రయత్నిస్తున్నారు. చిన్న, పెద్ద నాయకులనే తేడా లేకుండా అవకాశమున్నా ప్రతిచోట తమకు మద్దతు పలికాలని రహస్యంగా మంతనాలను సాగిస్తున్నారు. అప్పటి వరకు ఓ అభ్యర్థి వెంట నడిచిన నాయకులే వెనువెంటనే రహస్యంగా ఇతర అభ్యర్థులతో తమకేమీ కావాలో, ఏమీ ఇస్తే మద్దతు తెలుపుతామో ఓ చిట్టను అంది స్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో అభ్యర్థులు ఎవరూ ఎవరికి మద్దతిస్తున్నారో తమ రహస్యలను ప్రత్యర్థి అభ్యర్థులకు చేరవేస్తున్నారోనని తెలియని అయోమయ పరిస్థితులు అభ్యర్థులకు తలనొప్పిగా మారుతున్నాయి.

### ప్రలోభాల ఎర.. రహస్య మంతనాలు..

మేజర్ గ్రామపంచాయతీల్లో గెలువుబావుటా ఎగురవేసేందుకు ప్రధాన పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఓ వైపు అధికారి పార్టీ ఎన్నికల్లో గెలిచి తమకు తిరుగులేదని నిరూపించడానికి వ్యూహాలను సిద్ధం చేస్తుంటే మరొక వైపు ఎన్నికల్లో సాధ్యమైనన్నీ సర్పంచు స్థానాలను గెలిచి అధికార పార్టీకి షాక్ ఇచ్చి తమ ఉనికిని చాటుకునేందుకు ప్రతిపక్షాలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. ముఖ్యంగా ఏటూరునాగారం లాంటి మేజర్ గ్రామపంచాయతీల్లో ఇరు పార్టీలకు చెందిన బలమైన నాయకులు బరిలో నిలవడంతో ప్రలోబాల మరింత ఎక్కువగా కొనసాగుతున్నాయి. ఒకరేమో మంత్రి సీతక్క అనుచరుడైన గుండ్ల దేవేందర్ సతీమణి గుడ్లశ్రీలత, మరొక వైపు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు సతీమణి కాకుల మర్రి శ్రీలత బరిలో ఉండడంతో ఇద్దరి మధ్య పోరు హోరాహోరిగా కొనసాగనుంది. ఇరువురు అభ్యర్థులు తమ గెలుపును అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తుండడంతో పోటీ రసవత్తరంగా మారింది. దీంతో మొదటి విడత ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ కొనసాగుతుంది. ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతావో ఈ నెల 11 తెలనుంది.

## పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ సంకీర్త్

కాటారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా చర్యలు చేపట్టాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సబ్ డివిజన్ పోలీసు అధికారులను ఆదేశం చారు. కాటారం సర్కిల్ పరిధిలో గురువారం ఎస్పీ పర్యటించి కాటారం, మహాముత్తారం పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. పెగడపల్లి నామినేషన్ల క్లస్టర్ కేంద్రాన్ని పరిశీలించి నామినేషన్లు వేసిన అభ్యర్థులు, ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ అధికారులతో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరగడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం తలెత్తకుండా పకడ్బ ందీగా చర్యలు చేపట్టాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కాటారం స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్సైలు శ్రీనివాస్, మహేందర్‌కుమార్, రాజశేఖర్, మానస తదితరులు పాల్గొన్నారు.

## వాజేడులో రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ పర్యటన

వాజేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ప్రశాంత్ కుమార్ గురువారం మండలంలోని నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు, మురుమూరు, గుమ్మడిదొడ్డిలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ పత్రాలలో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా ఎన్నికల నియమావళి బుక్‌లెట్‌లో ఎన్నికలకు సంబంధించి అన్ని వివరాలను పొందుపరిచినట్లు ఆ బుక్‌లెట్‌ను అనుసరించి పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, డీటీ రాంసింగ్, ఆర్‌ఐ కుమారస్వామి తదితరులు ఉన్నారు.



గుమ్మడిదొడ్డి జీపీలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ప్రశాంత్‌కుమార్

## హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష



శిక్ష పడిన వంశీ

మహాముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండలం యామన్‌పల్లి గ్రామానికి చెందిన అట్టెం దేవెందర్ అనే వ్యక్తిపై హత్యాయత్నం చేసిన డోంగ్రి వంశీ అనే వ్యక్తికి గురువారం ఐదేళ్ల జైలు శిక్ష పడింది. మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం 2021 ఏప్రిల్ 25న యామన్‌పల్లి గ్రామానికి చెందిన అట్టెం దేవేందర్ అనే వ్యక్తిపై కాటారం గ్రామానికి చెందిన డోంగ్రి వంశీ ఇనుప రాడ్డుతో తలపై బలంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి సోదరి అట్టెం దేవిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశాడని తెలిపారు. కోర్టులో అడిషనల్ పీపీ ఎండీ రఫీక్ వాదనలు వినిపించగా గురువారం జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జీ ఎ.నాగరాజు సాక్ష్యాధారాలు పరిశీలించి డోంగ్రి వంశీకి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ముద్దాయిని చర్లపల్లి జైలుకు తరలించామని తెలిపారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేలా ప్రతిభ కనబర్చిన పోలీసులను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

## క్రీడలతో మానసికోల్లాసం : భూపాలపల్లి ఎస్పీ



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ సంకీర్త్

కృష్ణకాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో 63వ హోంగార్డు రైజింగ్ డే వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మొక్కని నాటి నీరు పోశారు. అనంతరం హోంగార్డుల వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హోంగార్డుల కోసం నిర్వహించే ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మానసికోల్లాసం, జట్టు స్ఫూర్తి, సేవాభావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విధి నిర్వహణలో శ్రద్ధ, క్రమశిక్షణ, సమన్వయం పెంపునకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు.

## ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా పనిచేయాలి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌ని అభినందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

కృష్ణకాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లంతా ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. గురువారం నియోజకవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలువగా వారిని శాలువాతో సత్కరించారు. గ్రామ ప్రజల ఐక్యతతో అభివృద్ధి లక్ష్యంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, గ్రామాల్లో ఇలాంటి సౌకర్యాల కల్పనకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎన్నికైన సర్పంచ్‌లు, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.




# ఉప సర్పంచ్ పదవి ఉత్తదేమీ కాదు !

- పలు పంచాయతీల్లో ఆ పదవికీ యమ డిమాండ్
- ఇప్పటి నుంచే మంతనాలు
- చెక్‌పవర్ ఉండడమే కారణం
- రిజర్వేషన్ కలిసిరాని చోట మారుతున్న వ్యూహాలు
- మహిళా సర్పంచులున్న చోట ఆధిపత్యానికి యత్నాలు

హనుమకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు ఉపసర్పంచ్ స్థానం కూడా హాట్ కేక్ అవుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతునిస్తున్న పార్టీలు ఒక సర్పంచ్ స్థానాన్ని మాత్రమే గెలుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని, ఉపసర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకుంటే గెలుపునకు పరిపూర్ణత సిద్ధిస్తుందని భావిస్తున్నాయి. ఇందు కోసం ఉపసర్పంచ్ స్థానాలపై కూడా ప్రధానంగా గురిపెడుతున్నాయి. దీనిని కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌ను కూడా కైవశం చేసుకోకపోతే పార్టీలు రాజకీయంగా ప్రతికూలతలను ఎదుర్కోవలసి ఉంటుంది. సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు కూడా అధికారాలు ఉండడమే ఈ పదవికి అంత క్రేజ్. ముఖ్యంగా ఉపసర్పంచ్‌కు చెక్‌పవర్ ఉండడం ఈ పదవి డిమాండ్‌ను పెంచింది. ఉపసర్పంచ్‌ను ఎన్నుకునేది వార్డు సభ్యులే అయినందు వల్ల ఈ వార్డు సభ్యుల పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజకీయంగా పార్టీల నుంచి గట్టి మద్దతు ఉన్నవారు వార్డు పదవుల్లో సైతం గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

**ఉప సర్పంచ్ అధికారాలు**

సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు కూడా విధులు, బాధ్యతలు ఉంటాయి. ఉపసర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాలలో పాల్గొనడం, సర్పంచ్‌కు సహాయం చేయడంతో పాటు సర్పంచ్ లేనప్పుడు పర్పంచ్ విధులను నిర్వహిస్తాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా జరిగేట్టు చూడడం, రోడ్లు, మురుగు కాలువలు, వంతెనలు, బావుల నిర్మాణం, నిర్వహణ వంటి ప్రజాపనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షిస్తాడు. గ్రామాలలో వీధి దీపాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తాడు. గ్రామాలలో ప్రాథమిక విద్యను అందించేందుకు కృషి చేస్తాడు. పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాడు.

**మారుతున్న వ్యూహాలు**

ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలంగా రానిచోట్ల నాయకులు వ్యూహం మార్చుకుంటున్నారు. సర్పంచి కాకపోకపోయినా చెక్‌పవర్ ఉన్న ఉపసర్పంచ్ పదవిని దక్కించుకొని ఊరిని ఏలుదామని పథకాలు రచించుకుంటున్నారు. ఆయా రిజర్వేషన్లకు చెంది వెంట ఉండేవారు, చెప్పిన మాట వినే అనుచరుడు, లేదంటే అతడి సతీమణిని సర్పంచ్‌గా బరిలోకి దింపి గెలిపించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొదటి విడత, రెండవ విడత ఎన్నికల నామినేషన్లలో ఇదే జరిగింది. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తున్నారు. ఉపసర్పంచ్ కావాలంటే వార్డ సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్ వేయిస్తున్నారు. వారికి అవసరమైన నామినేషన్ పత్రాలు, పన్నుల చెల్లింపు, ధృవపత్రాలు తీసుకోవడం వంటి పనులన్నీ ఆ నాయకులే చూసుకుంటున్నారు.

**మహిళా స్థానాల్లో ఆధిపత్యానికి..**

50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించారు. మహిళా సర్పంచులు గెలిచిన పంచాయతీల్లో ఉపసర్పంచ్‌గా గెలుపొంది ఆధిపత్యం చేలాయించవచ్చనే ఉద్దేశ్యంతో పలుకుబడి కలిగిన నేతలు వార్డు సభ్యులుగా బరిలోకి దిగుతున్నారు. పాలకవర్గ సమావేశాలకు సర్పంచ్ గైర్హాజరు అయిన సందర్భాల్లో ఉపసర్పంచ్ అధ్యక్షతనే నిర్వహిస్తారు. నిధుల వినియోగంలో సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు చెక్ పవర్ ఉంటుంది. దీంతో మేజర్ పంచాయతీల్లో వార్డు సభ్యుల పదవులకు రూ. లక్షల్లో వెచ్చించేందుకు అభ్యర్థులు వెనుకాడని పరిస్థితి ఉంది.

**రిజర్వేషన్ అనుకూలించక..**

సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించిన కొందరు నాయకులకు రిజర్వేషన్ అనుకూలించక పోవడంతో ఉపసర్పంచ్ పదవిపై కన్నేశారు. వారికి రిజర్వేషన్ అనుకూలించి వార్డు నుంచి సభ్యులుగా పోటీకి దిగుతున్నారు. పంచాయతీలో సర్పంచ్‌కు, ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్‌పవర్ ఉండడంతో పోటీ తీవ్రతరమైంది. ఇది సర్పంచ్ అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. ఏ అభివృద్ధి పనులు జరిగినా చెక్‌పై ఉపసర్పంచ్ సంతకం కచ్చితంగా పెట్టాల్సి రావడంతో సర్పంచ్ అక్రమాలకు తావుండదు. సంతకం చేయకపోతేప బిల్లు పాస్ అయ్యే అవకాశం తక్కువ. ఉన్నతాధికారులకూ ఫిర్యాదులు ఎక్కువగా వెళ్లే అవకాశం ఉంది. అభివృద్ధి చేయాలన్నా ఇద్దరు కలిసికట్టుగా ఉండాలి. సంయుక్తగా పని చేయాలి. సర్పంచ్‌కు దాదాపు సమానమైన ప్రోటోకాల్ ఉంటుంది. ఇదే అదనుగా భావించిన కొందరు సర్పంచ్ అభ్యర్థులు గెలిచిన వెంటనే తమకే ఉపసర్పంచ్ పదవి వచ్చేలా చక్రం తిప్పుతానని ఆశచూపి వారిని ప్రలోబాలకు గురి చేయడం ద్వారా తాము గెలవడానికి పావులు కదుపుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లో ఈ ఎత్తుగడులు ఎక్కువగా సాగుతున్నాయి. ప్రదానంగా నిరక్షరాస్యులైన మహిళలు పోటీ చేసే పంచాయతీల్లో ఉపసర్పంచ్‌కి మంచి డిమాండ్ ఉంది. ఆ పంచాయతీల్లో ఎక్కువ శాతం వారిదే పెత్తనం ఉండే అవకాశం ఉంది. అంతేకాక సర్పంచ్‌కి చేసే ప్రచార వ్యయం కంటే వార్డు సభ్యుని ప్రచారానికికయ్యే వ్యయం తక్కువ. వార్డు సభ్యుల నుంచే ఎన్నికవుతాడు కనుక ఆర్థికపరమైన ఒత్తిడి కూడా తక్కువగానే ఉంటుంది. దీనికితోడు సర్పంచ్ అభ్యర్థి సైతం కొద్దోగొప్పో వార్డుకు పోటీ అభ్యర్థులకు కూడా డబ్బులు సర్దుబాటు చేయడం పరిపాటి.

**ఎన్నిక ఇలా...**

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు మధ్యాహ్నంలోగానే వెలువడనున్నాయి. ఆ వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉపసర్పంచ్‌గా పోటీ చేసేవారు ముందుగా నామినేషన్లు దాఖలు చేయడం, వారిని వార్డు సభ్యుల్లో ఒకరు బలపరచడం వంటి తతంగం ముగిసిన తర్వాత ఎన్నికను నిర్వహిస్తారు. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారా ఎంపికను నిర్వహిస్తారు. ఎవరికి అనుకూలంగా ఎక్కువ మంది వార్డు సభ్యులు చేతులెత్తితే ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరి సమాన మద్దతు పలికనప్పుడు టాస్ ద్వారా గెలుపును నిర్ణయిస్తారు.

## సర్పంచ్ ఎన్నికల్లోనూ నోటా

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ నోటాకు అవకాశం కల్పించారు. ఓటుహక్కును వినియోగించుకోవడం ఓటరు బాధ్యత. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నచ్చలేదనే అభిప్రాయం తెలిపేందుకు నన్ ఆఫ్ ది ఎబౌ(నోటా) అవకాశం కల్పించింది. 2013వరకు ఓటర్లకు అభ్యర్థులు నచ్చకపోయినా సరైన అభ్యర్థి పోటీలో లేరని భావించిన ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండేది. అదే ఏడాది సెప్టెంబరు 27న దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో నోటా అమలులోకి వచ్చింది. ఎన్నికల సంఘం ఈవీఎంలలో నోటా బటన్ అమర్చి మొదటిసారిగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, మిజోరం శాసనసభ ఎన్నికల్లో శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి ప్రతి ఎన్నికల్లో నోటా ఉంటుంది. రాష్ట్ర పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణలోను దీనిని పొందుపరిచారు. దీనిని అనుసరించి ప్రస్తుతం బ్యాలెట్ విధానంలో జరిగే పంచాయతీరాజ్ ఎన్నికల్లోనూ బ్యాలెట్‌పత్రంలో చివరి గుర్తుగా నోటా ఉంటుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే దీనిమీద స్వస్తిక్ ముద్ర పడనుంది.

## అప్పీల్‌కు అవకాశం

**- తిరస్కరించిన నామినేషన్‌పై ఆర్డీవోకు అభ్యంతర పత్రం దాఖలు చేయవచ్చు**

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డుసభ్యుడిగా పోటీచేసే అభ్యర్థి నామినేషన్ తిరస్కరించినట్లయితే అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉంటుందని, ఆ అభ్యర్థి సంబంధిత ఆర్డీవోకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరపత్రం సమర్పించవచ్చు. నామినేషన్లు దాఖలు ముగిసిన అనంతరం తర్వాతరోజు వాటి పరిశీలన చేపడతారు. ఒకవేళ ఈ పరిశీలనలో నామినేషన్ తిరస్కరణకు గురైనమరే ఇతర విషయాలపైన అయినా అభ్యంతరం తెలిపేందుకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మరుసటిరోజు అవకాశం కల్పిస్తారు. ఈ అప్పీల్‌పై ఆతర్వాత రోజు అధికారులు పరిష్కారం వెల్లడిస్తారు.

## పంతులు.. నేను గెలుస్తానా ?

**- జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్న అభ్యర్థులు**

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంతో పాటు వివిధ మండలాల్లోని ఆయా గ్రామాల్లో సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు జాతకాన్ని చూసుకుంటున్నారు. పంతుల నా జాతకం చూసి చెప్పండి... ఎన్నికల్లో గెలుస్తానా..? జాతకం ఎలా ఉంది? ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నా అంటూ జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. సర్పంచ్ కావాలనే కోరిక ఉంది, పోటీచేసి గెలుస్తానా, ఏరోజు నామినేషన్ వేయాలి, ఏరోజు ప్రచారానికి వెళ్లాలి అని ఆరా తీస్తున్నారు. ఫలానా పంతులు జాతకం బాగా చెబుతాడంటే ఆయన వద్దకే వెళ్లి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు అభ్యర్థులు. జ్యోతిష్యుల సూచనల మేరకు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఏదేమైనా పంచాయతీ ఎన్నికలు ఆశావహులను గుళ్లు, గోపురాలబాట పట్టిస్తున్నాయి. దీంతో జ్యోతిష్యులు, వేద బ్రాహ్మణులు, పంతుళ్లకు గిరాకీ పెరిగింది.

# సమరానికి సై అంటూ..




- మొదటి విడతలో 91 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు
- 299 మంది సర్పంచ్, 1,219 మంది వార్డు స్థానాల కోసం పోటీ

వరంగల్ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతలో పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లోని 91 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ తరువాత 10 మంది సర్పంచ్‌లు, 215 మంది వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక పంచాయతీ ఎన్నికల్లో 299 మంది సర్పంచ్, 1,219 మంది వార్డుసభ్యుల స్థానాల కోసం పోటీ పడుతున్నారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు.

● పర్వతగిరి మండలంలో... మొత్తం 33 గ్రామాలు, 288 వార్డులు ఉండగా సర్పంచ్ స్థానానికి 257 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే 731 మంది వార్డు స్థానాలకు నామినేషన్లు వేశారు. ఇందులో మోత్యాతండా, దూపతండా, శ్రీనగర్ గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు ఏకగ్రీవం అయ్యారు. 134 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక 30 గ్రామాల్లో 120 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే మండలంలోని 288 వార్డులకు గాను 731 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందులో 75 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా, 158 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక 498 మంది బరిలో నిలిచారు.

● వర్ధన్నపేట మండలంలో 18 గ్రామాలు, 170 వార్డులున్నాయి. 129 మంది సర్పంచ్ అభ్యర్థులుగా, 397 మంది వార్డు స్థానాల కోసం నామినేషన్లను దాఖలు చేశారు. మండలంలో రామోజు కుమ్మరిగూడెం, చంద్రతండా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఇంకా 68 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో నిలువగా, మిగితా అభ్యర్థులు తమ నామినేషన్లను విరమించుకుని పోటీ నుంచి తప్పుకున్నారు. ఇక వార్డు స్థానాలకు 397 మంది నామినేషన్లు వేయగా, 32 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 325 మంది వార్డ్ స్థానాల కోసం పోటీ పడుతున్నారు.

● రాయపర్తి మండలంలో 40 గ్రామాలు, 342 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ అభ్యర్థులుగా 269 మంది, వార్డు స్థానాలకు 719 మంది నామినేషన్లను దాఖలు చేశారు. మండలంలో కిష్టాపురం, సూర్య తండా, పోతిరెడ్డిపల్లి, బాలునాయక్ తండా, మురిపిరాల గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 153 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక మిగిలింది 35 గ్రామాలకు గాను 111 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. అదేవిధంగా 719 వార్డు స్థానాల్లో 108 మంది ఏకగ్రీవమయ్యారు. 115 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా, 496 మంది వార్డు స్థానాల కోసం పోటీలో నిలిచారు.

# పెట్టుబడి భారం.. ధర పైనే ఆధారం..

**సాగు ఖర్చు పెరగడంతో రైతు విలవిల**

వర్ధన్నపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు పెట్టుబడి భారంగా మారుతోంది. ఏటా అన్ని రకాల ఖర్చులు పెరగుతుండటంతో రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. సొంత భూములు ఉండి మొదటి నుంచి వ్యవసాయం తప్ప ఇతర పనులు చేయలేని రైతులు గత్యంతరం లేక వరి సాగు చేస్తున్నారు. యంత్ర వినియోగం పెరగకపోవడంతో పూర్తిగా నేటికి కూలీలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాక్టర్, వరి కోతకు మినహా మిగతా పనులన్నీ మనుషులతో చేయాల్సిందే. కూలీలు తక్కువగా ఉండటంతో ధరలు పెరుగుతున్నాయి. దీనికి తోడు వరి సాగు విస్తీర్ణం పెరగడంతో ఇతర అవసరాలు అధికమయ్యాయి. ట్రాక్టర్ స్పేర్ పార్ట్స్, ఇంజన్ అయిల్స్, కల్టివేటర్ పత్తీలు, కర్రులు, వగ్గీలు, నట్టు బోల్టులు, పంచర్ ఖర్చు విపరీతంగా పెరిగింది. గతంలో ఒకరిద్దరు చేసే పనిని ఇప్పుడు నలుగురు చేస్తున్నారు. ప్రధానంగా స్వల్పకాలిక వంగడాలు సాగు చేస్తుండటంతో రైతులకు విత్తనాల ఖర్చు బాగా పెరిగింది. ప్రైవేట్ కంపెనీలవే కావడంతో వారుచెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సి వస్తోంది. గతంలో కంటే విత్తన భారం ఎక్కువగా ఉంటోంది. పురుగుమందులను సైతం ఏడాదికో రకం విడుదల చేసి ధరలు పెంచేస్తున్నారు.



**వరి సాగువైపే మొగ్గు**

పెట్టుబడి పెరిగినా తగినట్లుగా ధాన్యం ధర ఉంటే రైతులకు కొంత ఊరట ఉంటుంది. గతంలోలాగా క్వింటాకు రూ.2,200 నుంచి రూ.2,300 ఉంటే రైతులకు ఏమీ మిగలదు. కనీసం రూ.2,600 నుంచి రూ.2,800 ఉంటే పెరుగుతున్న ఖర్చులకు తగినట్లుగా ఆదాయం వస్తుందనే ఆశ ఉంటుంది. వ్యాపారులు సిండికేట్ అయి ధర తగ్గించి కొనుగోలు చేస్తే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇతర మెట్ట పంటల ధరలు దోబూచులాడుతుండడంతో చాలామంది రైతులు వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఏ ఆధారం లేని కౌలు రైతులు మరీ కుటుంబ పోషణకే పరిమితమయ్యేలా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

# కార్లలో తిరుగుతూ గొర్రెల చోరీలు

- ఐదుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు
- తాళం వేసిన పలు ఇళ్లల్లోనూ చోరీలు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గీసుగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలు చోరీలకు పాల్పడ్డ ఐదుగురు దొంగల ముఠాను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. కొద్ది రోజుల్లోనే చోరీల గుట్టును ఛేదించి నిందితుల నుంచి రూ.1.6 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మామునూరు ఏసీపీ వెంకటేశ్ గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో నిందితులు చేసిన చోరీల వివరాలను గురువారం వెల్లడించారు. నర్సంపేట మండలం ముగ్దుంపురం గ్రామానికి చెందిన బాదావత్ సాయిచరణ్, పోచమ్మమైదాన్‌కు చెందిన ఎమ్డీ.గౌస్‌పాషా, కాశిబుగ్గకు చెందిన కోట విశ్వతేజ, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన రాయపురం సాయి ముఠాగా ఏర్పడి పలు చోట్ల గొర్రెలతో పాటు, ఇళ్లల్లో చోరీలకు పాల్పడేవారు. గీసుగొండ మండలంలోని కొమ్మాల సమీపంలో మందల నుంచి గొర్రెలను కొద్ది రోజుల కిందట కారులో ఎత్తుకెళ్లారు. అలాగే పలు గ్రామాల్లో రెక్కీ నిర్వహించి ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు సీరియస్‌గా తీసుకొని టెక్నాలజీని ఉపయోగించి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు కార్లు అనుమానాస్పదంగా రావడంతో వాటిని ఆపి తనిఖీ చేశారు. కారులో గొర్రెల మలం, వాటి వెంట్రుకలు కనిపించడంతో నిందితులను పోలీసులు విచారించారు. దీంతో వారు ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడింది చెప్పారు.

కొమ్మాల గ్రామంలో ఇంటి తాళం పగులకొట్టి రూ.1,05,000 దొంగిలించినట్లు, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. గీసుగొండ, మామునూరు, మిల్స్‌కాలనీ, మడికొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడగా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వీరు గతంలో చోరీలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు ఏసీపీ వివరించారు. సెల్ఫ్ డ్రైవ్ కారులో వీరు దొంగతనాలకు పాల్పడుతుండేవారన్నారు. గొర్రెలను వర్ధన్నపేట గ్రామానికి చెందిన అంగడి వెంకన్నకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారన్నారు. గొర్రెలను కొనుగోలు చేసిన వెంకన్నను కూడా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కాగా, నిందితులను పట్టుకున్న సీఐ విశ్వేశ్వర్, ఎస్‌ఐ కుమార్, కానిస్టేబుళ్ల విజయ్, అరవింద్, సాయి, హరి, రజనికుమార్‌లను ఏసీపీ అభినందించారు.

# పేటలో సమస్యల మేట

- సతమతమవుతున్న నర్సంపేట పట్టణవాసులు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు.. అస్తవ్యస్తంగా డ్రైయినేజీలు
- కలగా మిగిలిన మినీ పార్కు.. అండర్ డ్రైయినేజీ వ్యవస్థ నిర్మాణం



వల్లభ్‌నగర్‌లో డ్రైయినేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

నర్సంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్న చందంగా మారింది నర్సంపేట పట్టణం పరిస్థితి. తెలంగాణ సాయుధ పోరాటాల గడ్డ, రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపందించి పేటగా పేరు గాంచింది. వరంగల్ జిల్లాలో అతిపెద్ద పట్టణంగా విరాజిల్లుతుంది. గ్రామపంచాయతీ నుంచి సెకడ్ గ్రేడ్ మునిసిపాలిటీ స్థాయికి ఎదిగిన పట్టణం ఇది. పాలకులు మారినా నర్సంపేట మోడల్ సిటీగా మారడం కలగానే మిగిలింది. గత బీఆర్‌ఎస్ పాలనలో పట్టణం కొంత మేరకు అభివృద్ధి చెందినా ఇంకా అనేక సమస్యలు పట్టణంలో తాండవిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ఏర్పాటైనా విద్య, వైద్య రంగాల్లో అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో విద్యార్థులు, ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వైద్యులు, మందుల కొరతతో అత్యవసర చికిత్సలు జరుగక ప్రమాదాలకు గురైన వారు వరంగల్, హైదరాబాద్ బాట పట్టాల్సి వస్తోంది.

**రోడ్లపై మురుగు నీరు**

నర్సంపేట పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 50 వేలకు పైగా జనాభా కలిగిన పట్టణంలోని అనేక వార్డుల్లో మురుగు కాల్వలు లేక రోడ్ల పైనే మురుగు నీరు పారుతుంది. వర్షాలు కురిస్తే రోడ్లపై నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. అనేక రోడ్లు బురదగా మారి ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల మౌలిక సౌకర్యాలు పరిష్కరించే దిశగా నేతలు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తాగునీటికి తండ్లాట**

నర్సంపేట పట్టణ ప్రజలను ప్రధానంగా తాగునీటి సమస్య వేధిస్తోంది. మిషన్ భగీరథ పనులు పూర్తికాక అనేక వార్డుల ప్రజలకు తాగునీరందడం లేదు. ప్రతీ ఏటా వర్షాకాలం, వేసవికాలంలో తాగునీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వాటర్ కొనుగోలు చేసి గొంతు తడుపుకోవాల్సి వస్తుంది. అలాగే పట్టణంలోని అన్నివార్డుల్లో అంతర్గత రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. పారిశుధ్య సమస్య ప్రజలను పట్టి పీడిస్తుంది. మాధన్నపేట కాల్వ అధ్వానంగా మారి సాగు నీరందించలేని పరిస్థితికి చేరింది. ఈ కాల్వలకు శాశ్వత (లైనింగ్) మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పార్క్, అండర్ డ్రెయినేజీ నిర్మాణం పట్టణ ప్రజలకు కలగా మిగిలింది.



చెత్తా చెదారంతో అధ్వానంగా మారిన పాత 20వ వార్డు

**నిరుపయోగంగా డీఫ్లోరైడ్ ప్రాజెక్టు**

నర్సంపేట, ఖానాపురం మండలం పరిధిలోని అయోధ్యనగర్ వద్ద టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రూ. 38 కోట్లతో డీఫ్లోరైడ్ ప్రాజెక్టును నిర్మించి అయోధ్యనగర్ వద్ద నీటిని నిల్వ చేసే బండ్‌ను నిర్మించారు. నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు వెళ్లే ప్రదేశంలో భారీ ఫిల్టర్ బెడ్లు, ట్యాంక్‌లను నిర్మించారు. కొంతకాలం పనిచేశాక ఈ ప్రాజెక్టు అలంకారప్రాయంగా మారింది. యంత్రాలన్నీ తుప్పు పట్టి పోయాయి. ఈ ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తే నర్సంపేట పట్టణ ప్రజలకు రోజు నీరందించే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టును వినియోగంలోకి తెచ్చి నర్సంపేట ప్రజలకు శాశ్వత తాగునీటి వసతి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

**సమస్యల వలయంలో వల్లభ్‌నగర్ గురుకులం**



వల్లభ్‌నగర్‌లోని గురుకులంలో పెచ్చులూడిన భవనం

నర్సంపేటలోని వల్లభ్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఈ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు విద్యనభ్య సిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగు దొడ్లు లేక విద్యార్థులు పడుతున్న గోస వర్ణణాతీతంగా ఉంది. కేవలం 20 స్నానగదులు ఉండడంతో విద్యార్థులకు రోజూ వెతలు తప్పడం లేదు. గురుకుల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం ఉరుస్తోంది. అలాగే భోజనశాల, డార్మెటరీ పైపెచ్చులు ఊడిపోతుండడంతో విద్యార్థులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ కళాశాల ఆవరణలోనే మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వక పోవడంతో తాగునీరు కళాశాల విద్యార్థులకు అందడం లేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బావి, బోరు నీటిని తాగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి గురుకులంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

## నర్సంపేట దశ తిరిగేనా ?

- సీఎంతో ఎమ్మెల్యే దొంతికి సయోధ్య
- పట్టణానికి తొలిసారిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయింది. ఈ రెండేళ్ల కాలంలో ఎడముఖం, పెడముఖంగా ఉండి దూరమైన రాజకీయ బంధం దగ్గరై సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిల మధ్య ఇటీవల సఖ్యత కుదిరింది. ఇటీవల ఎమ్మెల్యే మాధవరెడ్డి తల్లి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి సీఎం వచ్చారు. అప్పటి నుంచి సీఎం, ఎమ్మెల్యే మధ్య సఖ్యత కుదిరింది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించిన సమయంలో నర్సంపేటలో ఆయన పాదయాత్ర జరగకుండా నిలువరించినప్పటి నుంచి సీఎంగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా దూరంగా ఉన్నారు. రెండు విడతలుగా జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి చుక్కెదురైంది. దీంతో దొంతికి మంత్రి పదవి దక్కుతుందని ఆశించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో నిరుత్సాహం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య సఖ్యత కుదిరాక హైదరాబాద్‌లో సీఎంను కలిసి నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. సీఎంకు ఎమ్మెల్యే మాధవరెడ్డికి మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడడంతో నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధికి బాటలు పడతాయని బావిస్తున్నారు. తొలిసారి నర్సంపేట పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఎమ్మెల్యే మాధవరెడ్డికి మంత్రి పదవి కేటాయించే విషయంలో హామీ ఇస్తారని అందరూ ఎదురు చూస్తున్నారు. నర్సంపే ట నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఏడు దశాబ్దాల కాలంలో మంత్రి పదవి దక్కలేదు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
శుక్రవారం 5 డిసెంబరు 2025


# వైభవంగా దత్తాత్రేయస్వామి జయంతోత్సవం


పూజా క్రతువులో పాల్గొన్న దుద్దిళ్ల శ్రీనుబాబు తదితరులు

ఏటూరునాగారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం దత్త జయంతి, పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం 7 నుంచే దత్తాత్రేయ స్వామికి, సాయి నాథుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కోసం భజనలు నిర్వహించి, మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ముఖ్యఅతిథిగా ఎస్సై నరిగా రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు, భక్తులు, అయ్యప్ప స్వాములు, భవానీ మాల ధారులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గురు స్వాములు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త పౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహించారు.ఆలయ ఈవో మహేష్‌తో పాటు సిబ్బంది, గ్రామ ప్రజలు , భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● కాటారం : :మండలంలోని ధన్వాడ గ్రామంలో శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్త జయంతోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. వేదపండితులు కృష్ణమోహన్, ప్రవీణ్, గణేష్, సుమిత్‌పాండే రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తల్లి జయశ్రీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు-నితిక దంపతుల చేతులమీదుగా లక్ష తులసిదళాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహింపజేశారు. అనంతరం ఆలయంలో గత తొమ్మిది రోజులుగా వివిధ రకాల హోమాలు, పూజలతో వైభవంగా జరుగుతున్న దత్తనవరాత్రి ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు, కాళేశ్వరం, మంథని ప్రాంతాల వేదపండితులు గణపతి, రుద్ర, మన్యసూక్తహోమాలు నిర్వాహించి మహా బలిప్రధానం, పూర్ణహుతి చేశారు. పలువురు భక్తులు జయంతి వేడుకల్లో పాల్గొని 108దివ్యజ్యోతులతో స్వామివారి ఊరేగింపు చేశారు.


పూజలో పాల్గొన్న ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు


కాళేశ్వరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

## బీజేపీలో పలువురి చేరిక

గణపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పలు పార్టీల నుంచి భారతీయ జనతా పార్టీలో చేరిన కార్యకర్తలను రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి గురువారం కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షుడు నిషిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఊర నవీన్‌రావు, మనోహర్, అనిల్, రాజేష్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## అమలులో కోడ్.. బెల్టులు ఫుల్

గణపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఒక వైపు మొదటి విడత ఎన్నికల్లో భాగంగా ప్రచారం జోరుగా సాగుతుంటే గ్రామాల్లో సాయంత్రం బెల్టు లు మాత్రం బార్‌లను తలపిస్తున్నాయి. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## జర్నలిస్టులను చిన్నచూపు చూడొద్దు

కృష్ణకాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను చిన్నచూపు చూడటం సరికాదని జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వెల్లేదారిలో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీకటి గణేష్, నరేష్ నేత, పొక్కూరి శ్రీనాథ్, గాజుల అరుణ్, సందీప్‌గౌడ్, ఆదిత్య, వినయ్‌పటేల్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేటాయించిన కేంద్రాల్లోనే ఓటు వేయాలి

ఏటూరునాగారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు వారి ఓటరు కార్డు లిస్టు ప్రకారం కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లోనే తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏటూరునాగారం అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 11 న జరిగే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను ఆయన వెల్లడించారు. 1 నుంచి 12వ వార్డులు వారు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల(జడ్పీహెచ్‌ఎస్)లో ఈ వార్డులకు సంబం ధించిన ఓటర్లందరికీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

అంతేకాకుండా 13వ వార్డు అకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన వారికి విద్యుత్ కార్యాలయం వెళ్లే మార్గంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

## ఐదు పంచాయతీల్లో దాఖలు కాని నామినేషన్లు

వెంకటాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం రెండవరోజు గురువారం కొనసాగింది. కాగా, మండలంలోని ఐదు పంచాయతీల్లో రెండోరోజు సైతం సర్పంచ్, వార్డు స్థానాలకు ఎవరూ నామినేషన్ వేయలేదు. శుక్రవారం ఒక్కరోజు మాత్రమే నామినేషన్ వేసేందుకు సమయం ఉంది. కాగా, మండలంలోని 18 పంచాయతీలకుగాను 23 సర్పంచ్, 63వార్డు స్థానాలకు మాత్రమే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

## ఖర్చు తడిసి మోపెడు

(5వ పేజీ తరువాయి)

ఖర్చు చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. 5వేలకుపైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీలో పోటీ చేసే వార్డు సభ్యులు రూ.50వేలు, సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50 లక్షలు పరిమితి విధించింది. క్షేత్ర స్థాయిలో ప్రచారానికి వచ్చేటప్పటికీ ఈ పరిమితులు దాటి ఖర్చు అపరిమితంగా పెరుగనున్నది. ఇంత ఖర్చు చేసినా విజయం వరిస్తుందా? అని మరికొందరు ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

### మూడో విడతలో మరింత ఖర్చు

మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం ఖర్చు విషయంలో మరింత ఆందోళన చెందుతున్నారు. మొదటి, రెండోవిడత కన్నా చివరన మూడో విడతన జరిగే ఎన్నికల్లో ఖర్చు భారీగా పెరగనుందని వాపోతున్నారు. మొదటి విడత ఈనెల 11, రెండో విడత 14న, మూడోవిడత 17 పోలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే రెండు, మూడో విడత ఎన్నికలు జరిగే గ్రామాల ఆశావహులకు చిక్కొచ్చి పడింది. అసలే ప్రచారం, విందులు, మందు, డబ్బు పంపకాలకు ఎక్కువ ఖర్చు అవుతుండగా మొదటి విడతకన్నా రెండు, మూడో విడత పోలింగ్ జరగడానికి ఎక్కువ రోజులు పడుతున్నందువల్ల తమపై ఎక్కువ భారం పడనుందని ఆశావహులు చెబుతున్నారు. ఓటర్లు ప్రత్యర్థులకు మద్దతు తెలపకుండా ఇప్పటినుంచే వారిని మచ్చిక చేసుకొని తమ వైపే ఉండేట్లు చూసుకోవడానికి ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సి ఉంటుందని వాపోతున్నారు.

## కొనసాగిన రెండోరోజు నామినేషన్ల పర్వం

(5వ పేజీ తరువాయి)

పూసూరు జీపీ నుంచి 2 సర్పంచ్, 4 వార్డు మెంబర్, టేకులగూడెం జీపీ నుంచి 1 సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే వెంకటాపురం మండలం నుంచి బెస్తగూడెం జీపీ నుంచి 2 సర్పంచ్. వెంకటాపురం నుంచి 1 సర్పంచ్, బోదాపురం జీపీ నుంచి 3 సర్పంచ్, ఆలుబాక జీపీ నుంచి 1 సర్పంచ్, టీసీ మర్రిగూడెం జీపీ నుంచి 1 సర్పంచ్, ఎదిర జీపీ నుంచి 2 సర్పంచ్, మరికాల జీపీ నుంచి 5 సర్పంచ్, మొర్రివానిగూడెం జీపీ నుంచి 1 సర్పంచ్, నూగూరు జీపీ నుంచి 1 సర్పంచ్, వీరభద్రావరం జీపీ నుంచి 5 సర్పంచ్, వెంకటాపురం జీపీ నుంచి 1 సర్పంచ్, రామచంద్రాపురం జీపీ నుంచి 1 సర్పంచ్ నామినేషన్లతో పాటు 63 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలయ్యాయి. కన్నాయిగూడెం మండలంలోని చింతగూడెం జీపీ నుంచి 2 సర్పంచ్, 6 వార్డు మెంబర్, ఏటూరు జీపీ నుంచి 1 సర్పంచ్, 6 వార్డు మెంబర్, కంతనపల్లి జీపీ నుంచి 6 వార్డు మెంబర్, లక్ష్మీపురం జీపీ నుంచి 1 సర్పంచ్, 5 వార్డు మెంబర్, రాజన్నపేట జీపీ నుంచి 3 సర్పంచ్, 2 వార్డు మెంబర్, గుర్రేవుల జీపీ నుంచి 2 వార్డు మెంబర్, తుపాకులగూడెం జీపీ నుంచి 1 వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కన్నాయిగూడెం మండలం నుంచి నామినేషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కాటారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో తమ సత్తా చాటారు. నవంబరు 30నుంచి ఈ నెల 3వరకు రాజన్నసిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరపున ఆడి అత్యంత ప్రతిభ కనబర్చడంతో చరణ్, రాంతేజ్ అనే విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. అత్యుత్త మ ప్రతిభతో గోల్డ్ మెడల్స్ సాధించి గురుకులానికి మంచి పేరు తెచ్చిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ మాధవి, వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటయ్య, బలరాం, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, డిప్యూటీ వార్డెన్ రాజబాపు, ఉపాధ్యాయులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## పలువురు ముస్లింలు కాంగ్రెస్‌లో చేరిక

కాటారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని ధన్వాడలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో మహదేవపూర్ గ్రామానికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజా మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మసూద్ అలీ, ముజాహిద్‌ఖాన్, సయ్యద్ షౌకత్ అలీ, హఫీజ్, అస్మత్, అతీక్, నసీం, ఇమ్రాన్, జాహెద్, వసీం తదితరులు కాంగ్రెస్ చేరగా మంత్రి శ్రీధర్‌బాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు, మహదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ జడ్పీటీసీ హసీనాబాను, నాయకులు వామన్‌రావు, పద్మ, సుధాకర్, ఎజాస్ అహ్మద్, అస్రార్ ఖురేషి, చాంద్, మెహరాజ్ తదితరులు ఉన్నారు.

## బీసీలను గుర్తించిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్

కృష్ణకాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలను గుర్తించిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తుందని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ ఆరోపించారు. గురవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీసీల ను గుర్తించి అన్ని కుల సంఘాలకు భవనాలు ఇచ్చారన్నారు. అదే తరహాలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సారథ్యంలో 20 బీసీ కుల సంఘాలకు భూములు కేటాయించి భవనాల కొరకై రూ.9.40 కోట్లు మంజూరు ఇప్పించినట్లు గుర్తు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన 42 రిజర్వేషన్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ తరుపున చేసే పోరాటానికి బీసీ జేఏసీ నేతలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నేత కొల్లోజు దిలీప్‌కుమార్, యుగేంద్రచారి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నేత చేరిక


కాంగ్రెస్‌లోకి సరస్వతిని ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాజేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పేరూరు మాజీ సర్పంచ్ యాలం సరస్వతి గురువారం సాయంత్రం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె తో పాటు మరో 20 కుటుంబాలు హస్తం గూటికి చేరుకున్నాయి. మాజీ సర్పంచ్ యాలం సరస్వతి గతంలో పేరూరు సర్పంచ్‌గా బీఆర్‌ఎస్ మద్దతు గెలిచారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు దగ్గర ఉండటంతో ఆమె కాంగ్రెస్‌లోకి రావడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆమెకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాదబాబు రాజు, కాకర్లపూడి కల్యాణ్ వర్మలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు నల్లగాసి రమేష్ యాదవ్, బొల్లె వెంకన్న, కుర్సం కృష్ణమూర్తి, ఆనందరావు, బొల్లె నరేష్, గార రాంబాబు, తొటపల్లి ఎల్లయ్య, కోరం పగిడయ్య, అరికిల్ల తిరుపతి, చిన్న సమ్మయ్య, తల్లడి శ్రీకాంత్, నవీన్ యాదవ్ ఉన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వాలి

ఏటూరునాగారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని, వారికి రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ముందుగా ఇటీవల ఆ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పాల్తీయ సారయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్(పదవీ విరమణ ప్రయోజనాలు), హెల్త్ కార్డులు(ఆరోగ్య కార్డులు) వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న ఆరు డిఏలను(కరువు భత్యాలను) కూడా ప్రభుత్వం తక్షణమే ప్రకటిం చాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం కార్యవర్గ సభ్యులు మీనయ్య, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ

మల్లూర్, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని కొయ్యూర్‌లోని నామినేషన్ సెంటర్‌ను గురువారం ఎస్పీ సంకీర్త్ పరిశీలించారు. నామినేషన్‌ను సెంటర్ వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల జరుపుకునేలా సహకరించాలన్నారు. అనంతరం కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నారాయణ్‌నాయక్, ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగం పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మల్లూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఓటు హక్కు వినియోగంపై గురువా రం మండలంలోని కొయ్యూర్‌లో టీఎస్ఎస్ కళాకారులు కళాజాత బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించారు. ఈ కళాజాత కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి సెగ్గెం శిరీష, సుమలత, రాధిక, మహేందర్, కమ్మల ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## పూర్తికాని పనులను పరిశీలించిన అధికారులు

మహదేవపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి త్రివేణి సంగమ గోదావరిలో గత ఎనిమిది నెలల క్రితం సరస్వతి పుష్కరాలలో ప్రారంభమైన పనులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో మహేష్ గురువారం పూర్తిగాని పనులను పర్యవేక్షించారు. వాటి నివేదికను అధికారులకు పంపినట్లు సమాచారం. ఇప్పటివరకు టాయిలెట్లు, కేశఖండనం, శారద మండపంతో పాటు పనులు పూర్తి కాకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదిరోజుల క్రితం జిల్లా కలెక్టర్ అంత్య పుష్కరాల సమావేశాన్ని నిర్వహించి పనులు పూర్తి చేసి ఆదేశాలు జారీ చేసినప్పటికి ఇప్పటివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయి. కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవడంతో పనుల పరిస్థితిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలిసింది.

## నామినేషన్ కేంద్రాల పరిశీలన

వెంకటాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను గురువారం ములుగు జిల్లా ఎన్నికల పరిశీలకులు, ఇండస్ట్రీస్ జేడీ హైదరాబాద్ ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని టీసీమర్రిగూడెం, పాత్రాపురం, వెంకటాపురం నామినేషన్ కేంద్రాలను పరిశీలించి నామినేషన్ జరిగే ప్రక్రియను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తదితరులు ఉన్నారు.

# ఏకగ్రీవాలపై పలు పార్టీల నజర్

చిట్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవం చేసుకునేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలకు ఈనెల 14న ఎన్నికలు జరరగాల్సి ఉండగా నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 6తో ముగియనుంది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులను ఏకగ్రీవం చేసుకునేందుకు అవసరమైతే పార్టీ కండువాలు మార్చి ఎన్నుకునేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు పాశిగడ్డతండా , చైన్‌పాక సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. దీంతో ఇరు పార్టీల నాయకులు కుదురుతే సర్పంచ్ లేదంటే ఉపసర్పంచ్ పదవిని కైవసం చేసుకునేందుకు భేరాలు కుదుర్చుకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మండలంలోని ఓగ్రామంలో బీఆర్‌ఎస్ మద్దతుతో సర్పంచ్ పదవికి నామినేషన్ వేసిన వ్యక్తి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఉపసర్పంచ్ కోసం బీఆర్‌ఎస్ నాయకులు పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఇదే కాకుండా మండలంలోని మరో మూడు గ్రామాల్లో ఏకగ్రీవాలపై ఆయా గ్రామాల పెద్దలు రంగంలోకి దిగి రాజీ కుదుర్చుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలో అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలిపించుకునేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నియోజకవర్గం స్థాయి నేతలు రంగలోకి దిగి పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా ఈరెండు రోజుల్లో ఎన్ని గ్రామాల్లో పాలకవర్గాలు ఏకగ్రీవమవుతాయో తెలుస్తుంది.

### సర్పంచ్ స్థానానికి 162 .. వార్డు స్థానాలకు 555

మండలంలోని 26 గ్రామ పంచాయతీలు ఉండగా సర్పంచ్ స్థానాలకు 162 మంది, 218 వార్డు స్థానాలకు 555 మంది అభ్యర్థులు నామినేషన్ దాకలు చేశారు. చైన్‌పాకలో మాంత మనోహర్, పాశిగడ్డతండలో లావుడ్యా రవీందర్‌నాయక్‌తో పాటు వార్డ సభ్యులు ఏకగ్రీవం అయ్యాయి. 24 జీపీల్లో సర్పంచ్ బరిలో 158 మంది, వార్డుమెంబర్ బరిలో 541 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నామినేషన్‌ల ఉపసంహకకణకు ఇంకా రెండు రోజులు మిగిలిఉన్న నేపథ్యంలో ఎంత మంది ఉపసంహరించుకుంటారో వేచిచూడాల్సిందే.

## బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురి సస్పెండ్

గణపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు బీఆర్‌ఎస్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మోతె కర్ణాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గందం సుధాకర్, విజేందర్, పెరుమాండ్ల రాజయ్యలు పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించడంతో మాజీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహారావు, మాజీ ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, రమేష్, సారయ్య, సాంబయ్య, దేవేందర్, రాకేష్‌లు తదితరులు ఉన్నారు.

## జీపీవోల మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

మల్హర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గ్రామ పాలన అధికారుల(జీపీవో)ల సంఘాన్ని గురువారం తాడిచర్లలో ఎన్నుకున్నారు. జీపీవోల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా రాసూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మేడిపల్లి రాజు, జనరల్ సెక్రటరీ గొట్టం నరేష్, కోశాధికారిగ సంపత్, ప్రచారకర్త రాజేందర్‌లను ఎన్నుకున్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మంగపేట డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) 11 కేవీ ట్రాన్స్ ఫార్మర్ వైర్లు తగిలి పాడి గేదె మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని బోరు నర్సాపురం గ్రామంలో జరిగింది. బాధితుడు మన్నెం నాగేశ్వరరావు తెలిపిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం మేత కోసం పాడి గేదెను వదిలానని మేత కోసం వెళ్లిన గేదె ఏటూరు నాగారం బూర్గంపాడు ప్రధాన రహదారి ప్రక్కన గల లోలెవల్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద 11కెవి విద్యుత్ వైర్లు మృతి చెందిందని రైతు నాగేశ్వరరావు తెలిపాడు. పాడి గేదె మృతితో సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లిందని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు నష్ట పరిహారం ఇవ్వా లని బాధిత రైతు నాగేశ్వరరావు కోరారు.

## మానసిక ఆరోగ్యంపై అవగాహన

ములుగు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జనని ఫౌండేషన్ డాక్టర్ రాజా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏహెచ్ఎస్, కేజీబీవీ బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు మాసిక శుద్ధి, ఆరోగ్యంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు మాసిక శుద్ధి ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన అలవాట్లు, విద్యను కొనసాగించడంపై విద్యార్థినులకు ఫౌండేషన్ సభ్యులు అవగాహన కలిగించడం మంచి కార్యక్రమమని అన్నారు. అనంతరం విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ వర్ధంతిని జయప్రదం చేయాలి

మంగపేట డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం కమలాపురం గ్రామ అధ్యక్షుడు దాసరి బుజ్జి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం మండలంలోని కమలాపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఈ నెల 6న కమలాపురం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం జరుపనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు యంపెల్లి వీరీస్వామి, చెటుపల్లి వెంకటేశ్వర్లు, పబ్బోజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గద్దెల పునఃప్రతిష్ఠాపన వాయిదా

(5వ పేజీ తరువాయి)

ఏర్పడ్డాయనే వాదనలు వినిపి స్తున్నాయి. పూజా కార్యక్రమానికి సరిపడా డబ్బులు దేవస్థానం ద్వారా అందాయో లేదో అని పలువురు చర్చించుకుంటున్నారు.

**- పూజారుల ఆలస్యమా.. పనుల్లో జాప్యమా..?**

మేడారం మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను అధికారులు చేపడుతున్నారు. తల్లులను దర్శించుకు నేందుకు రానున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కోట్లు వెచ్చించి సమ్మక్క-సారలమ్మ గద్దెల పునరుద్ధరణతోపాటు, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల పునః ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. అందులో భాగంగా గురువారం(ఈ నెల 4న) గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలను పునః ప్రతిష్ఠించేందుకు పూజారులు మూహుర్తం ఖరారు చేశారు. అయితే ఆ తంతు అనుకున్న సమయానికి జరగలేదు. తిథి కుదరక పోవడంతో ఈ నెల 24 కు వాయిదా వేసినట్లు పూజారు చెబుతున్నారు. పూజారులు అనుకున్న సమయానికి మేడారం రాకపవడంతోనే గద్దెల పునః ప్రతిపన వాయిదా పడిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా కాంట్రాక్టర్ అనుకున్న సమయానికి నిర్మాణాలు చేపట్టకపోవడంతోనే వాయిదా అయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రి పొంగులేటి ఆదేశించినప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతందని, జాతర మయానికి పనులు పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## జోరుగా ముందస్తు మొక్కులు

(5వ పేజీ తరువాయి)

పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. కాగా ఈ నెల 23న పగిడిద్దరాజు, గోవిందరాజుల పునఃప్రతిష్ఠకు పూజారులు ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

### గోవిందరాజు గద్దె స్థల చలన వేడుకలు

మేడారంలో గోవిందరాజు గద్దె స్థల చలన వేడుకలను పూజారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలోని గోవిందరాజు ప్రధాన ఆలయంలో పూజారులు పూజలు నిర్వహించి మేడారం చేరుకున్నారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గోవిందరాజు గద్దెపై రహస్య పూజలు నిర్వహించి దీప దూప నైవేద్యాలు సమర్పించారు. కాగా నూతన గద్దెలపైకి తరలించేందుకు సిద్ధంగా ఉండేలా గోవిందరాజు గద్దె స్థల చలన వేడుకలను జరుపుకున్నారు. ముందుగా పసుపు కుంకుమలు, పట్టు వస్త్రాలు సమర్పించి గడ్డపారకు కంకణం కట్టారు. ఆయుధ పూజలు నిర్వహించి గద్దెను కదిలించారు. అనంతరం అక్కడ నుంచి ఐదు పిడికిలి మట్టిని సేకరించి భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, పూజారులు మునిందర్, కృష్ణయ్య, రమేష్, రఘుపతిరావు, గోవర్ధన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పగిడిద్దరాజు గద్దె స్థల చలన వేడుకను గత నెల 23వ తేదీనే నిర్వహించారు.


గోవిందరాజు గద్దె స్థాన చలనం చేస్తున్న పూజారులు